
కథ



# హడావిడి

సరస్వతి దుర్భ

అబ్బబ్బ! ఒకటే హడావిడి. డిసెంబరు, జనవరి నెలల్లో భారతదేశానికి ఎన్.ఆర్.ఐ.ల రాకపోకలు విపరీతం. వాళ్ళు ఇండియాలో పెట్టుబడులు పెట్టే ప్రాస్పెక్టివ్ ఇన్వెస్టర్స్ కారు. ఎంఎస్ చదవడానికి వెళ్లినవాళ్లు, ఎం.ఎస్ పూర్తి చేసి అక్కడే ఉద్యోగాలు సంపాదించుకొని చేస్తున్నవాళ్లు, కొడుకులు, కోడళ్లు, లాడ్‌లాలు, మధ్యతరగతి కంటి దీపాలు. తమ మాతృదేశానికి, మాతృమూర్తికి సమర్పించుకొనే ఆర్ద్రమైన తీర్థయాత్ర అది.

ట్రావెల్ షెడ్యూల్ కన్‌ఫర్మ్ అయిందని ఇ మెయిల్‌లో వర్తమానం అందడానికి నెల ముందు నుంచీ, అమెరికా నివాసానికి అలవాటు పడ్డ అపురూపసంతానానికి అనువుగా ఉండేటట్లు హడావిడిగా పాత యింటి నుంచి కొత్త ఇంటికి మకాం మార్చేశాం. ఆహా! ఎంత బాగుంది కొత్త ఇల్లు! నరకం లోంచి స్వర్గం లోకి వచ్చినట్లుగా ఉంది నాకు. ఇదంతా నా కొడుకు మెహర్బానీయే కదా అనుకున్నాను గర్వంగా, సంతృప్తిగా.

కొత్త ఇంట్లో సెటిల్ అయి, ఆ రోజు ఇ మెయిల్ బ్రౌస్ చేస్తుంటే అబ్బాయి పంపిన ట్రావెల్ ప్లాన్ కనపడింది. కొడుకు, కోడలు కలిసి వారం రోజులు ఇక్కడ, మధ్యలో రెండు వారాలు విడివిడిగా ఎవరి తల్లి దగ్గర వారు, ఆప్యాయంగా, ఆంతరంగికంగా. ఆ తరువాత చివరి వారం కూతురు, అల్లుడు, ఇద్దరూ కలిసి అత్తవారింట్లో. వియ్యపురాళ్లిద్దరమూ టెలిఫోన్ చర్చలలో బిజీ అయిపోయేము. పిల్లల కోసం ఏమేం ఊరగాయలు, పిండి వంటలు తయారు చేసి ఉంచాలా అని చర్చించుకున్నాం.

ఆ రోజు రానేవచ్చింది. మా వియ్యపురాలు ఒక రోజు సెలవు పెట్టుకుని వచ్చింది, కూతుర్ని, అల్లుణ్ని రిసీవ్ చేసుకోవడానికి. ఎయిర్ పోర్ట్‌లో అబ్బాయికీ, కోడలికీ అందరం కలిసి అభిమానపూర్వకంగా స్వాగతం పలికాము. ఇంటికి వచ్చాక వారం రోజుల పాటు ఒకటే హడావిడి. రోజూ ఎవరో ఒకరు, మామయ్యలో, అత్తలో, బంధువులో, రావడం అమెరికాలో కొత్త కాపురం అన్యోన్యంగా ఉందా లేదా? తల్లీకొడుకూ, అత్తాకోడళ్ల మధ్య సంబంధాలు ఎలా ఉన్నాయి అని రహస్యంగా మనసులో ఆరాలు తీసుకుంటూ, పైకి మాత్రం మేనల్లుళ్ల విజయం పట్ల హర్షం ప్రకటిస్తున్నారు మామయ్యలు.

భోజనాల దగ్గర ఒక రోజు నేను, "ఇవ్వాళ వంటంతా మా కోడలే చేసింది, ఒక్క అన్నం, పప్పు మాత్రమే నేను చేశాను" అన్నాను.

"ఆః వంట చెయ్యడం చాలా తేలికే, పైపనులే కష్టం" సాగదీసింది మా ఆడబిడ్డ.

"ఎంఎస్ చదివి, అమెరికాలో ఉద్యోగం చేస్తున్న కోడలు పప్పుచారు ఇంత రుచిగా చేసిందంటే, చాలా మెచ్చుకోదగిన విషయమే" అని మామయ్య అన్నాడు. "అయినా ఇందులో మునక్కాడలు ఉంటేనే పర్‌ఫెక్ట్‌గా ఉన్నట్టు" అని మళ్లీ చివరలో తగిలించాడు.

ఇంటికి వచ్చిన వాళ్లందరినీ అబ్బాయి కొన్న కొత్త సోఫా సెట్ మీద కూర్చోపెట్టి నేను, గారెలు, పెరుగు గారెలతో పాటు,

ఇంట్లో చేసినవి, బజారులో కొన్నవి అని చెప్పి రెండేసి కోవా కజ్జికాయలు ఇచ్చి, రుచిచూసి ఏది బాగుందో చెప్పమని అడుగుతూంటే, కొడుకు, కోడలు, ఆనందంగా, ఆశ్చర్యంగా చూశారు. అత్తయ్య ఎట్ యాహూ డాట్ కామ్‌కి కోడలు రెగ్యులర్‌గా ఇ మెయిల్, ఆన్‌లైన్ గ్రీటింగ్స్ పంపిస్తుందని తెలుసుకొని చిన్న మామయ్య విస్తుపోయాడు.

అలా వారం రోజులు గడిచిపోయాయి. ఇంక ఏవ రమ్మ దగ్గర వాళ్లు. మధ్యతరగతి కోడలు పుట్టింటికి వెళ్లేటప్పుడు ఫస్ట్ క్లాస్ ఏసీ. వచ్చేటప్పుడు విమానంలో రావడం. ఇదే [illegible] నా పెళ్లయిన కొత్తల్లో ఎలా వెళ్లేను. ఎలా వచ్చేను అని ఒకసారి నెమరు వేసుకున్నాను.

పెళ్లాం పుట్టింటికి వెళ్లింది. అమ్మతో, తమ్ముడితో తీరికగా ఇంటి విషయాలు చర్చించాడు పెద్ద కొడుకు. "నువ్వు చేసిన బిర్యానీ చాలా బాగుందమ్మా. అబ్బ! చపాతీలు తిని ఎన్ని రోజులైంది!" అనుకుంటూ అమ్మ చేతివంట ఆప్యాయంగా ఆస్వాదించాడు.

బడీ చౌడీలోనూ, మోండా మార్కెట్‌లోనూ, ఉసిరికాయలు, మామిడికాయలు దొరుకుతున్నాయి. మెంతావకాయ, ఉసిరావకాయ, తొక్కుడు పచ్చడి, దోసావకాయ, సాంబారు పొడి, కూర పొడి, అల్లం చట్నీ, అన్నీ, పాత బెల్లపావకాయతో సహా తయారు చేసి ఉంచాను. అవన్నీ నేనూ, చిన్నబ్బాయి వెళ్లి, అమెరికా ప్యాకింగ్ చేయించుకు వచ్చాం.

అమెరికా నించి ఇటాలియన్ పగడాలు తెచ్చారు అబ్బాయీ, కోడలూ.

"ఇక్కడ చవగ్గా దొరుకుతుంటే అంతపెట్టి ఎందుకు తెచ్చారు?" అన్నాను.

మా అబ్బాయి ఇక్కడి నించే మరిన్ని కొని తీసికెళ్లి అక్కడ అమ్ముతానని శపథం చేశాడు.

"ఆల్ ది బెస్ట్ మై సన్!" అన్నాన్నేను.

కోడలు ఒక్కొక్కటీ 20 డాలర్లు పెట్టి యు.ఎస్.ఏ. నించి తెచ్చిన జపానీస్ సిల్క్, షిఫాన్ చీరలు చూసి అందరూ విభ్రాంతి చెందారు. వాటి మీద హిందీ పేర్లు ప్రింట్ చేసి ఉన్నాయి. అవి ఇక్కడ నాలుగైదు వందలకు దొరుకుతున్నాయి! అక్కడ అనవసరంగా అంత పెట్టారు అని, మళ్లీ ఏమోలే క్వాలిటీలో తేడా ఉండొచ్చునని మనసును సరిపెట్టుకున్నాను.

అబ్బాయి అత్తారింటికి వెళ్లాడు. అక్కడ అందరూ కలిసి సత్యనారాయణవ్రతాలు చేసుకున్నారట. పుణ్యక్షేత్రాలు చూసి వచ్చారు. అంతా కలిసి తిరిగి వచ్చారు. షాపింగ్ చేసుకున్నారు. అవసరమైన బట్టలు, వంటింటి సామాను కోడలు కొనుక్కొంది. నేనిచ్చిన అందమైన టెయిలరింగ్ కిట్ తల్లికి చూపించి, మురిసిపోయింది మా కోడలు. మా ఇద్దరి అన్యోన్యాన్ని చూసి అసూయపడింది మా వియ్యపురాలు.

కోడలు పుట్టింటి నించి చింతకాయ పచ్చడి, టొమాటో, గోంగూర, ఉసిరికాయ, మిరపప్పళ్ల పచ్చళ్లు, వాళ్ల పెద్దమ్మ గారు ప్రత్యేకంగా కోనసీమ నుంచి పెట్టి తెచ్చిన స్పెషల్ ఆవకాయ, చల్ల మిరపకాయలు తెచ్చుకొంది. మళ్లీ వెళ్లి కొడుకు, కోడలు అన్నీ అమెరికా ప్యాకింగ్ చేయించుకొని వచ్చారు. మధ్యలో రాజమండ్రి నుంచి మా అమ్మాయి స్నేహితుడి తల్లిదండ్రులు 15 ఆవకాయ ప్యాకెట్లు పట్టుకొచ్చి, అమెరికాలో ఉంటున్న వాళ్ల అమ్మాయిలకు ఇవ్వాల్సిందిగా కోరారు. నిజానికి ఇప్పుడు గ్లోబలైజేషన్ పుణ్యమా అని అమెరికాలో దొరకని వస్తువే లేదు. "బూడిద గుమ్మడికాయ వడియాలు పెట్టాను. అత్తయ్యా, చాలా బాగా కుదిరా"యని, ఇక్కడికి రాక ముందు ఇ మెయిల్‌లో కోడలు చెప్పింది.

18వ శతాబ్దిలో శ్రీనివాసరామానుజన్ శాకాహారం దొరకక ఇంగ్లాండులో కృశించి అర్ధాయుష్షుతో చనిపోయారు. 19వ శతాబ్దిలో మహాత్మాగాంధీ ఆహారవిషయంగా విదేశాలలో ఇబ్బంది పడ్డారు. 20వ శతాబ్దిలో పరిస్థితి కొంత మెరుగు పడింది. ఇప్పుడు 21వ శతాబ్దిలో విదేశాలలో మినీ ఇండియాలు, మినీ ఆంధ్రప్రదేశ్‌లు అని పిలువదగిన కాలనీలు ఏర్పడ్డాయి.


ఇప్పుడు అమెరికాలోని తెలుగు వారు వదినా అంటే వదినా అని పిలుచుకొని, తీరికగా కబుర్లు చెప్పుకుంటున్నారు. అప్పుడెప్పుడో ఆర్.కె. నారాయణ్ గారు చెప్పినట్లుగా కాక, ఇప్పుడు అక్కడ అమెరికాలోనూ, ఇక్కడ స్వదేశంలోనూ కూడా పరిస్థితులు చాలా మారిపోయాయి.

నాలుగు పెద్ద పెట్టెలూ ఎక్కువ భాగం ఊరగాయ ప్యాకెట్స్‌తోనే నిండిపోయాయి. చివరగా చేగోడీలు, జంతికలు, మురుకులు చేసి, అవి కూడా పెట్టాను. ఊరగాయలు, తినుబండారాలు అన్నీ రెండేసి సెట్లు చేసి ఇచ్చాను. ఒకదాని మీద పెద్దబ్బాయి పేరు, ఇంకొక దాని మీద చిన్న కొడుకు పేరు రాసి ఇచ్చాను. సిన్‌సినాటిలో పిహెచ్‌డి చేస్తున్న చిన్నవాడు క్రిస్మస్, న్యూ ఇయర్ సెలవులకు తమ దగ్గరికి వస్తే, ఇవన్నీ ఇవ్వమని చెప్పాను. అలాగే పప్పు వండే చిన్న కుక్కరు కూడా ఇవ్వమని చెప్పాను కోడలితో.

ఇంతలో బంధువులందరి దగ్గర నించీ దావత్‌లకి ఆహ్వానాలొస్తున్నాయి. పెళ్లప్పుడు వెళ్లనివాళ్ల ఇళ్లకి ఇప్పుడు వెళ్లాలని నిర్ణయించుకున్నారు పిల్లలు. చిట్టి మామయ్య కరెంటుతో వెలిగే దీపస్తంభాల సెట్ ఇచ్చాడు. దొడ్డమ్మ యాత్ర నించి తీసుకువచ్చిన గంగ నీటి బాటిల్, కాశీ అన్నపూర్ణ, చేతిలో గరిటెతో సహా ఉన్న కంచు విగ్రహం ఇచ్చింది. జూబ్లీ హిల్స్‌లోని శంకర్ బావ ఇంటిని చూసి, "ఔరా! ఇండియాలో సాఫ్ట్ వేర్ ఉద్యోగులు వింత పోష్గా బతుకుతున్నారు!" అని ఆశ్చర్యపోయేడు. అమెరికా నించి వచ్చిన మా బంగారం నాన్న.

పిల్లలు తిరిగి వెళ్లవలసిన రోజు దగ్గర పడింది. అందరి మనసులూ బరువెక్కాయి. వియ్యపురాలు మళ్లీ ఒక రోజు సెలవు పెట్టుకుని వచ్చారు. చివరి రోజు అందరం మంచి హోటల్లో భోజనం చేశాం. చిన్న అబ్బాయి ఏసీ కాబ్ వ్యాన్ తీసుకు వచ్చాడు. కోడలు జీన్స్, టీ షర్ట్ వేసుకుని ఇండియన్ డ్రెస్ కోడ్ నించి బంధవిముక్తురాలైనట్లు తేలికగా ఫీల్ అయ్యింది.

ఇప్పుడు 21వ శతాబ్దిలో విదేశాలలో మినీ ఇండియాలు, మినీ ఆంధ్రప్రదేశ్‌లు అని పిలువదగిన కాలనీలు ఏర్పడ్డాయి. ఇప్పుడు అమెరికాలోని తెలుగు వారు వదినా అంటే వదినా అని పిలుచుకొని, తీరికగా కబుర్లు చెప్పుకుంటున్నారు. అప్పుడెప్పుడో ఆర్.కె. నారాయణ్ గారు చెప్పినట్లుగా కాక, ఇప్పుడు అక్కడ అమెరికాలోనూ, ఇక్కడ స్వదేశంలోనూ కూడా పరిస్థితులు చాలా మారిపోయాయి.



# ఖజు రహో!

అదరహో అనిపించేలా ఉంటాయి ఖజురహో శిల్పాలు. విదేశీయులు మక్కువగా దర్శించే ప్రాంతం ఇది. బుందేల్‌ఖండ్‌లో ఉంది. బౌద్ధ-జైనధర్మాల ప్రభావంతో జనం సన్యాసులుగా మారుతుంటే చందల్ రాజులు, వారిని మళ్లీ సంసార కూపంతికి ఆకర్షించటం కోసం, ఈ శిల్పాలు గోడలపై చెక్కించారట. పది చ.కి.మీ. ఉన్న ఖజురహో మందిరాలు, ఒకప్పుడు వందల సంఖ్యలో ఉండేవి. కానీ ఇప్పుడు 30 మాత్రమే ఉన్నాయి. వీటిని మూడు భాగాలుగా విభజింప వచ్చు. క్రీ.శ. 1065లో విద్యాధర వర్మన్ కట్టించిన కందారియా మహాదేవమందిరం శిల్పంలో అద్భుతం. 117 అడుగుల పొడవు, అంటే ఎత్తున్న దీని వెడల్పు 66 అడుగులు. ఇది బైట నుంచి గుహలా కనపడుతుంది. గర్భాలయంలో పాలరాతి శివలింగం ఆకర్షణీయంగా ఉంటుంది. అతిప్రాచీన గుడి 64 యోగినుల మందిరం, 6వ శతాబ్దిలో నిర్మితమైంది. తాంత్రిక మంత్రాలతో ఆ 64 యోగినులు పూజించేవారలు. ప్రస్తుతం ఆ విగ్రహాలు లేవు. క్రీ.శ. 930లో రాజు యశోవర్మన్ పంచాయి, తన శైలిలో లక్ష్మణమందిరాన్ని కట్టించాడు. 16 వేల మంది శిల్పులు మధుర నుంచి వచ్చి ఏడేళ్లు కట్టారు. 1002లో విశ్వసాథమందిరాన్ని ధంగదేవ్ బర్మన్, చిత్రగుప్త మందిరాన్ని, సూర్యాలయాన్నీ కట్టించాడు. వరాహ, పార్వతి, మహాదేవ, వామన, బ్రహ్మ, జగదంబ-ఇలా ఎన్నో గుళ్లు గోపురాలున్నాయి. ఖజురహోలో మనం హాయిగా నడుచుకుంటూ అన్ని ప్రాంతాలూ, గుళ్లూ తిరిగి ఆనందించవచ్చు. గ్వాలియర్, ఝాన్సీ, ఆగ్రా, బెనారస్, అలహాబాద్‌ల నుంచి బస్సులో వెళ్లొచ్చు.

**- అచ్యుతుని రాజ్యశ్రీ**

---

వ్యాన్‌లో డ్రైవర్ పక్కన చిన్నబ్బాయి కూర్చున్నాడు. వెనుక సీట్లో తల్లి ఒళ్లో ఎక్కి కూర్చొని గారాలు పోతోంది కోడలు. మధ్యలో నేను, ఆ పక్కన పెద్దబ్బాయి. కొడుకు, కోడలు తమ తమ తల్లుల మీద పోటీలు పడి ప్రేమ కురిపిస్తున్నారు.

"ఎయిర్ పోర్ట్‌కి పట్టుచీర కట్టుకొని రా అమ్మా!" అని చెప్పిన పెద్ద కొడుకు నా చేతిని తడిమి చూస్తూ, "అమ్మా! నీ చేతులింత ర్యాష్‌గా అయిపోయేయేమిటి? నేను అమెరికా నుంచి తీసుకువచ్చిన మాయిశ్చరైజర్ క్రమం తప్పకుండా రాసుకో, నీ హెల్త్ జాగ్రత్తగా చూసుకో. నేను అమెరికా నుంచి తెచ్చిన రెండు ఎయిర్ ప్యూరిఫైయర్‌లు ఇంట్లో అమర్చుకొని వాడుకొంటూ ఉండు" అని చెప్పాడు.

చివరిలో జరిగింది అసలైన వింత! నేను, చిన్నబ్బాయి ఎయిర్ పోర్ట్‌లో ఎనర్జీ డ్రింక్స్ కొనడానికి వెళ్లినపుడు, ఎవరితో చెప్పకుండా వియ్యపురాలు తన చేతిలోని సూట్ కేస్‌తో సహ ఎంట్రీ టికెట్ కానీ, ట్రావెల్ టికెట్ కానీ లేకుండా, చక్కగా లోపలికి వెళ్లిపోయింది, చెక్కింగ్‌కి వెళ్లిన కూతురు దగ్గరికి. కొడుకు, కోడలు 'బై' చెప్పేసి, ఫైనల్‌గా మాట్లాడుకోవలసిన మాటలు మాట్లాడేసి, విమానం ఎక్కడానికి వెళ్లిపోయారు.

నేను, చిన్నబ్బాయి, పెద్దబ్బాయి ఫ్రెండ్ సతీష్ వెనక్కి తిరిగాము. నాతో చెప్పకుండా లోపలికి వెళ్లిపోయిన వియ్యపురాలి మీద చాలా కోపంగా ఉంది నాకు. ఎందుకంటే ఆవిడ ఎంట్రీ టికెట్ కూడా నా చేతిలో పెట్టుకొని, అరగంట సేపు ఆవిడ కోసం బయట ఇటూ అటూ వెతుకుతూ ఉన్నాను. "ఆ టైమ్‌లో మా అబ్బాయితో కాసేపు మాట్లాడుకొనేదాన్ని కదా!" అనుకున్నాను.

ఇంటికి వచ్చి కూర్చొని ఆలోచిస్తే, నెల రోజులు ఎలా గడిచిపోయాయి అనిపించింది. క్రితం సంవత్సరం కొడుకులిద్దరూ అమెరికాలో ఉండి నా మీద బెంగ పెట్టుకున్నారు. ఫోన్‌లో వారి ఆర్ద్రస్వరాలు విని కంగారు పడిపోయాను. అక్కడికీ నాలుగైదు రోజుల కొకసారి రెండు-మూడు గంటల సేపు వెబ్ కాంలు కూడా పెట్టుకొని చాట్ చేస్తూనే ఉంటాము. "అంత బెంగ పెట్టుకుంటూ, రెస్ట్‌లెస్‌గా కష్టపడి పని చేస్తూ అమెరికాలో ఉండే బదులు ఇండియాకి వచ్చేయకూడదా?" అంటే, "ఆ ఒక్కటీ అడగొద్దమ్మా!" అంటారు.

ఈ రోజుల్లో ప్రతి ఒక్క ఆవలి తెలుగింటి పిల్లో, పిల్లవాడో, అమెరికాకి వెళ్తానే ఉన్నారు. ఇప్పుడది సామాన్యవిషయమై పోయింది. కానీ ఇంటి దగ్గర ఉండిపోయిన తల్లిదండ్రులకు దిగులు, ఆందోళన తప్పటం లేదు. ప్రపంచమంతా యుద్ధవాతావరణం. ఎప్పుడు, ఎక్కడ బాంబులు పేల్తాయో అని భయం భయంగా దూరతీరాలలో ఉన్న పిల్లలను తల్చుకొని టెన్షన్!

అంతలో అమెరికాలోని చిన్న కొడుకు దగ్గరి నించి ఫోన్ వచ్చింది. "అమ్మా! నువ్వు చేసి మాఫ్రెండ్ రవిగాడి చేత పంపించిన 'రాళ్లు, రప్పలు' అందేయి. 'రప్పలు' అంటే చేగోడీలు, రవిగాడిని, వాడి రూమ్ మేట్స్‌ని తీసుకోమని చెప్పి, 'రాళ్లు' అంటే, కరకజ్జం మాత్రం నా రూమ్‌కి తెచ్చుకున్నాను. మా రూమ్ మేట్స్ అంతా ఆ స్వీట్ నన్ను కొట్టడానికి, శిల్పాలుగా మలచుకోవడానికి చాలా సూటబుల్‌గా ఉంది అంటున్నారమ్మా!" అన్నాడు. కొడుకు తమాషా మాటలకి మనస్ఫూర్తిగా నవ్వుకొన్న నేను, నా టెన్షన్ అంతా మరిచిపోయి హాయిగా ఫీల్ అయ్యాను.